## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**కుత్బుల్లాపూర్:** 11కేవీ బాలాజీ ఆసుపత్రి ఫీడర్ లైన్ బ్యూరిఫికేషన్ పనుల నేపథ్యంలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని పేట్‌బషీరాబాద్ ఏఈ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 11కేవీ వైష్ణవి ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు వైష్ణవి ఎన్‌క్లేవ్, వనమాస్ స్కే లర్, ఎస్ఎల్ఎస్ అపార్ట్‌మెంట్స్, కల్యాణ్ కన్‌స్ట్రక్షన్స్ ప్రాంతాల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

## గణేష్ ఉత్సవ సమితి సమావేశం

**నిజాంపేట్:** భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి నిజాంపేట్ కార్పొరేషన్ కన్వీనర్‌గా మంద పాటి శ్రీధర్‌రెడ్డిని నియమించారు. అదేవిధంగా కో కన్వీనర్‌గా కాసాని నరసింహ, ఏనుగుల నరసింహారెడ్డిలను నియమించారు. బుధవారం నిజాంపేట్‌లోని మల్లన్న టెంపుల్‌లో జరిగిన సమావేశంలో ఎంపిక చేశారు. అదేవిధంగా నిమజ్జన గాట్ల వద్ద ఏర్పాట్లు, పారిశుద్ధ్యం, మండపాల నిర్వహణ, పోలీస్ సెక్యూరిటీ, విద్యుత్ అధికారుల సమన్వయంతో అన్ని ఏర్పాట్లు చేయాలని తీర్మానించారు.

## కేబుల్ వైర్ల తరలింపు



కుత్బుల్లాపూర్‌కు వెళ్లే రోడ్డులో తొలగించిన కేబుల్ వైర్లను తరలిస్తున్న విద్యుత్ సిబ్బంది

**రంగారెడ్డినగర్:** విద్యుత్ స్తంభాల నుంచి తొలగించిన కేబుల్ వైర్లను బుధవారం విద్యుత్ శాఖ అధికారులు తరలించారు. కుత్బుల్లాపూర్ గ్రామానికి వెళ్లే రోడ్డులో ఇటీవల విద్యుత్ స్తంభాలకు అమర్చిన కేబుళ్లను విద్యుత్ సిబ్బంది తొలగించారు. అయితే రోడ్డు పక్కన వేయడంతో వాహనదారుల రాకపోకలకు ఆటంకంగా మారిన విషయమై ఫిర్యాదులు అందాయి. దీంతో బుధవారం విద్యుత్ సిబ్బంది కేబుళ్లను డీసీఎం వ్యాన్‌లో తరలించారు. త్వరలో మిగతా ప్రాంతాల్లో సైతం వైర్లను తరలిస్తామని విద్యుత్ శాఖ అధికారులు పేర్కొన్నారు.

## కార్మికులకు అండగా ఉంటా

**కుత్బుల్లాపూర్:** కార్మికుల హక్కుల సాధనకు ఎంత వరకైనా పోరాడుతానని కార్మిక నేత ముద్దాపురం మదన్‌గౌడ్ అన్నారు. టార్క్ ఇండియా కంపెనీలో మూడు సంవత్సరాల క్రితం మెషిన్ పని చేస్తుండగా మహేశ్వర్ అనే కార్మికుడి చేతి వేళ్లు తెగిపడ్డాయి. అయితే ఆ సమయంలో మదన్‌గౌడ్ ఘటనా స్థలానికి చేరుకుని యాజమాన్యంతో చర్చించగా.. మహేశ్వర్‌ను పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చారు. అయితే అతడిని ఉద్యోగం నుండి తొలగించి ఎలాంటి ఆర్థిక సహాయం అందించకపోవడంతో మదన్‌గౌడ్‌ను ఆశ్రయించారు. దీంతో ఆయన ఈ విషయమై పరిశ్రమ యాజమాన్యంతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తానని బాధితుడికి భరోసా ఇచ్చారు.

## తొలగించారు సరే.. తరలించరా?

### రోడ్లపైనే తొలగించిన కేబుల్ వైర్లు



**సుభాష్‌నగర్:** నగరంలో ప్రమాదాలకు కారణం అవుతున్న కేబుల్, ఇంటర్నెట్ వైర్లను తొలగించాలని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మూడు రోజుల నుంచి ప్రధాన రోడ్లలోని విద్యుత్ స్తంభాలకు ఉన్న కేబుల్ వైర్లను విద్యుత్ అధికారులు తొలగిస్తున్నారు. తొలగించిన కేబుల్ వైర్లను తరలించకుండా రోడ్ల పైన చిందరవందర వేయడంతో ప్రమాదాలు చోటు చేసుకునే ప్రమాదం ఉంది. గాజులరామారం షాపూర్ ప్రధాన రోడ్డులో సంబంధిత అధికారులు కేబుల్ వైర్లను తొలగించి రోడ్లపైనే చిందరవందరగా వేశారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి రోడ్డుపై ఉన్న కేబుల్ వైర్లను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

## వీడని సహస్రిని హత్య మిస్టరీ

### ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీసీపీ

**మూసాపేట:** కూకట్‌పల్లి, దయార్‌గూడలో బాలిక సహస్రిని (11) హత్య మిస్టరీ ఇంకా వీడలేదు. పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఎస్ఓటీ, సీసీఎస్, లా అండ్ ఆర్డర్ పోలీసులు వివిధ బృందాలుగా ఏర్పడి క్షుణ్ణంగా నిందితుడి కోసం జల్లెడ పడుతున్నారు. బుధవారం ఎస్ఓటీ అడిషనల్ డీసీపీ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. భవనంలో అద్దెకున్న వారిని, స్థానికులను, బంధువులను, పలువురిని ప్రశ్నించారు. ఇప్పటి వరకు హత్య మిస్టరీపై పోలీసులు ఎలాంటి స్పష్టత ఇవ్వటం లేదు. దర్యాప్తు వేగవంతంగా జరుగుతుందని, దర్యాప్తు అనంతరం వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

# మురుగు.. పరుగు



రంగారెడ్డినగర్‌లోని బాలాజీ టెంట్‌హౌస్ గల్లీలో వరదలా పారుతున్న మురుగునీరు

- నిత్యం రోడ్లపై మురుగు ప్రవాహం
- ఇబ్బందులు పడుతున్న కాలనీల ప్రజలు
- పట్టించుకోని అధికారులు

ఒక వైపు వర్షం.. మరో వైపు డ్రైనేజీ నీరు పారడటంతో ఆ బస్తీ వాసులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి రంగారెడ్డినగర్‌లో కొన్ని రోజులుగా భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల నుంచి మురుగు ఉప్పొంగి ఏరులై పారుతోంది. దీంతో పలు గల్లీల ప్రజలు దుర్వాసన భరించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న తరుణంలో ఎక్కడ వ్యాధుల బారిన పడతామోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

– రంగారెడ్డినగర్

### పైపులైన్ చిన్నది కావడంతో..

రంగారెడ్డినగర్‌ను ఆనుకుని ఉన్న గాంధీనగర్ పారిశ్రామికవాడకు చెందిన పలు పరిశ్రమల డ్రైనేజీ లైన్‌లను ప్రధాన లైన్‌కు అనుసంధానం చేయకుండా రంగారెడ్డినగర్‌లోని అంతర్గత పైపు లైన్ వ్యవస్థకు కలిపి అధికారులు చేతులు దులుపుకున్నారు. వివేకానంద విగ్రహం సమీపంలోని నందా బ్రెడ్ కంపెనీ నుంచి ప్రధాన రోడ్డుపై ఉన్న శివాజీ విగ్రహం వరకు ఉన్న పైపులైన్‌ను బస్తీలోని పైపులైన్‌కు కలపడంతో తరచూ పైపులైన్ సామర్థ్యం సరిపోక మురుగునీరు తరచూ రోడ్లపైకి చేరుతోంది. ప్రధానంగా రాములు రేషన్ దుకాణం గల్లీ, ఓం జెండా వీధి, హనుమాన్ దేవాలయ గల్లీల్లో మురుగునీరు ముంచెత్తుతోంది. నాలుగైదు గల్లీల్లో వరదలా మురుగు ప్రవహించడంతో తీవ్ర దుర్గంధం వస్తుంది. దీంతో ఆయా గల్లీల్లోని నివాసితులు ఇళ్లల్లో నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంటుంది. ముఖ్యంగా హనుమాన్ ఆలయానికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

### అధికారుల నిర్లక్ష్యంతో ఇబ్బందులు

గతంలో జీహెచ్ఎంసీ అధికారుల ప్రణాళిక లోపం, బాధ్యతారాహిత్యంతో తాము ఇబ్బందులు పడాల్సి వస్తోందని రంగారెడ్డినగర్ వాసులు వాపోతున్నారు. గాంధీనగర్ ఇండస్ట్రీయల్ ఏరియా నుంచి వచ్చే మురుగు నీటిని, వరద ప్రవాహాన్ని 60 అడుగుల రోడ్డులో ప్రత్యేక లైన్ ద్వారా ఐడీపీఎల్ ఖాళీ స్థలంలోని నాలాలకు మళ్లించాల్సి ఉండగా.. పక్కనే రంగారెడ్డినగర్ బస్తీలో కలిపారని స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇండస్ట్రీయల్ లైన్‌ను ప్రత్యేక పైపు లైన్ వేసి ఐడీపీఎల్ ఖాళీ ప్రదేశంలోని ప్రధాన పైపులైన్‌కు కలిపితే సమస్యకు పరిష్కారం అవుతుంది. ఈ విషయంలో అధికారులు, జలమండలి అధికారులు సమన్వయంతో వ్యవహరించి మురుగు ప్రవాహానికి అడ్డుకట్ట వేయాలని రంగారెడ్డినగర్ వాసులు కోరుతున్నారు.

## జేఐఏ ఆధ్వర్యంలో ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ క్యాంప్



వైద్యశిబిరంలో పాల్గొన్న మల్లారెడ్డి

**జీడిమెట్ల:** ఇండస్ట్రీయల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళల కోసం ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ క్యాంపు ఏర్పాటు చేయడం గొప్ప విషయమని బీజేపీ జిల్లా అధ్యక్షులు డా.ఎస్.మల్లారెడ్డి అన్నారు. బుధవారం జీడిమెట్ల ఇండస్ట్రీయల్ అసోసియేషన్ కార్యాలయం ఆవరణలో కిమ్స్ ఆసుపత్రి సహకారంతో క్యాంపు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి శిబిరాలను మరిన్ని ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం జేఐఏ అధ్యక్షులు సాయికిషోర్ మాట్లాడుతూ.. కేన్సర్‌ను ముందుగానే గుర్తిస్తే మహిళలు ప్రాణాప్రాయం నుంచి తమను తాము రక్షించుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఐలా చైర్మన్ పి.డి.ఎస్.ఎన్ రాజు, సీఐఐ డివిజినల్ చైర్మన్ ఆర్.శివప్రసాద్‌రెడ్డి, గాంధీనగర్ ఇండస్ట్రీయల్ అసోసియేషన్ చైర్మన్ స్వామిగౌడ్, ఎల్ఎస్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు బక్క శంకర్ రెడ్డి, మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎంఎస్.వాసు, సత్తిబాబు, బీజేపీ 130 డివిజన్ అధ్యక్షులు విజయేందర్‌రెడ్డి, సూరారం డివిజన్ అధ్యక్షులు కేశవ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## గుంతల రోడ్లకు మరమ్మతులు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

**నిజాంపేట్:** గుంతల రోడ్లకు వెంటనే మరమ్మతులు చేయాలని బీజేపీ బాచుపల్లి అధ్యక్షుడు ప్రసాద్‌రాజు అన్నారు. గుంతల రోడ్లకు మరమ్మతులు చేయాలని బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. మండల పరిధి 17వ వార్డు కౌసల్య కాలనీ వద్ద 15 రోజుల క్రితం ప్రధాన రోడ్డు మరమ్మతుల కోసం రోడ్డు తవ్వడం వల్ల వారం నుంచి కురిసిన వర్షానికి రోడ్డు నీటితో నిండి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కమిషనర్ స్పందించి కౌసల్య కాలనీ రోడ్లు త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నారాయణ మూర్తి, గజ్జెల్లి సంతోష్ కుమార్, సురేష్, ఉదయ్, విజయ్, విజ్ఞాన్‌రెడ్డి, ప్రహ్లాద్, కాసాని సంతోష్, వినీత్‌రెడ్డి, ఐలయ్య, జమదగ్ని, రవీందర్, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహాధర్నా వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



**నిజాంపేట్:** సీపీఎస్ రద్దుకై సెప్టెంబర్ 1న ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని పీఆర్‌టీయూ టీఎస్ బాచుపల్లి మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పర్మగళ్ళ నర్సింలు, మాలి ప్రమోద్ కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం నిజాంపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ధర్నా వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎన్నికల ముందు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కార్యవర్గ సభ్యులు శివప్రసాద్, రాజారావు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



హాజరైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

### ఎంఎల్ఆర్ఐటీ వ్యవస్థాపక కార్యదర్శి, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



**దుండిగల్:** ప్రతి విద్యార్థి తమ కేరీర్‌పై దృష్టి సారించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎంఎల్ఆర్ఐటీ వ్యవస్థాపక కార్యదర్శి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇంజినీరింగ్ కళాశాల (ఎంఎల్ఆర్ఐటీ)లో 21వ బీటెక్ మొదటి సంవత్సర విద్యార్థుల ఓరింటేషన్ డే ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, కోశాధికారి రాజశేఖర్‌రెడ్డిలు నూతనంగా చేరిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అత్యున్నత విద్యా ప్రమాణాలతో, అధునాత ల్యాబ్ సౌకర్యంతో అధ్యాపక బృందం విద్యను అందిస్తుందన్నారు. బీటెక్ మొదటి సంవత్సరం ఎంతో ముఖ్యమైందని, అధ్యాపకుల శిక్షణలో మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీనివాసరావు, డైరెక్టర్ అను శ్రేయా రెడ్డి, కోశాధికారి మర్రి మమతారెడ్డి, వైస్ చైర్మన్ మర్రి ధీరేన్‌రెడ్డి, డీన్ డాక్టర్ రాధిక దేవి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## సెయింట్ మార్టిన్స్‌లో ఈ సెల్ ప్రారంభం



ఈ సెల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న సెయింట్ మార్టిన్స్ యాజమాన్యం, అధ్యాపక బృందం

**సుభాష్‌నగర్:** దూలపల్లిలోని సెయింట్ మార్టిన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ఎంట్రప్రెన్యూర్‌షిప్ సెల్ (ఈ సెల్)ను ప్రారంభించారు. స్ట్రాటజిక్ రిలేషన్స్ డైరెక్టర్ లలిత్ శర్మ, జీటీఎం ఎక్స్‌పర్ట్, స్టార్టప్ మెంటర్ శీతల్ శ్రీకాంత్, సైబర్ సెక్యూరిటీ స్పెషలిస్ట్ కార్తికేయ కుమార్, ఇండస్ట్రీ అండ్ కస్టమ్స్ అడ్వైజరీ డైరెక్టర్ మనీష్‌గుప్తా ముఖ్య అతిథులుగా హాజరై ఈ.సెల్‌ను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో ఎంటర్‌ప్రెన్యూర్ స్కిల్స్‌తో స్టార్టప్‌లను డెవలప్ చేసేందుకు ఈ సెల్ దోహదపడతుందన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర మాట్లాడుతూ ఈ సెల్ ద్వారా తమ విద్యార్థులకు గ్లోబెల్ ఎంటర్‌ప్రెన్యూర్, సాంకేతిక పరమైన సహాయం అందుతుందన్నారు. కార్యక్రమంలో చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ చంద్రశేఖర్‌యాదవ్, ఈ సెల్ చైర్మన్ కుమార్ జి.రామకృష్ణ, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా సత్యనారాయణ స్వామి వ్రతం

**రంగారెడ్డినగర్:** ఏపీహెచ్‌బీ కాలనీలోని జలమండలి కార్యాలయ ఆవరణలోని దుర్గామాత ఆలయంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని బుధవారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. కాలనీ వాసులు కుటుంబ సమేతంగా వ్రతంలో పాల్గొని స్వామి వారికి పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో జరిగిన అన్నదానంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఇరిగేషన్ రిటైర్డ్ ఉద్యోగి తీరుపై కాలనీ వాసుల ఆగ్రహం

**కుత్బుల్లాపూర్:** ఇరిగేషన్ రిటైర్డ్ ఉద్యోగి తమపై కక్ష సాధింపులకు పాల్పడుతున్నాడని, వందలాదిమంది ప్లాట్లు కొనుగోలు చేసి ఉంటున్న ఇల్లు, ప్లాట్లు మునిగేలా డ్రైనేజీ నీరు ఫాక్స్ సాగర్ లో కలిసే విధంగా గండి కొట్టారని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 125ఆర్ నుంచి 126ఆర్ వరకు 1994లో వెంచర్ ప్రారంభించి 2020 సంవత్సరంలో అమ్మకాలు, కొనుగోలు జరిగాయని.. సుమారు 406 ప్లాట్లు ఉన్న ఈ కాలనీలో 32 మంది ఎల్ఆర్ఎస్ రెగ్యులర్ చేసుకొని నిర్మాణాలకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఇదే క్రమంలో ఇరిగేషన్ రిటైర్డ్ ఉద్యోగి రామారావు ఇటీవల వర్షపు నీరు సాఫీగా వెళ్లే క్రమంలో డ్రైనేజీ పైపులైన్ ఫాక్ సాగర్‌లో కలిసే విధంగా గండి కొట్టారని వేంకటేశ్వర ఫ్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు.



నిరసన వ్యక్తం చేస్తున్న అసోసియేషన్ సభ్యులు

## ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న ఏసీపీ బాలగంగిరెడ్డి

### ఏసీపీ బాలగంగిరెడ్డి

**కుత్బుల్లాపూర్:** గణేశ్ ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని పేట్‌బషీరాబాద్ ఏసీపీ బాలగంగిరెడ్డి అన్నారు. బుధవారం పేట్‌బషీరాబాద్ పీఎస్ ఆవరణలో సీఐ విజయవర్ధన్ ఆధ్వర్యంలో గణేశ్ మండప నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గణేశ్ మండపాలకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని, ముందస్తుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. డీజేలకు ఎలాంటి అనుమతులు ఉండవని, మండపాల భద్రత బాధ్యత నిర్వాహకులదేనన్నారు. తొమ్మిది రోజుల పాటు మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా శాంతియుతంగా వేడుకలు జరుపుకోవాలన్నారు. సమావేశంలో గణేశ్ మండప నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీకి సహకరించాలి



సదస్సులో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్, సహాస్ ఎన్జీవో సభ్యులు

**దుండిగల్:** ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా దుండిగల్‌ను తీర్చిదిద్దడానికి ప్రజలు సహకరించాలని కమిషనర్ వెంకటేశ్వర్‌నాయక్ అన్నారు. బుధవారం దుండిగల్ మున్సిపల్ కార్యాలయంలో సహాస్ ఎన్జీవో సంస్థ ఆధ్వర్యంలో హైజనిక్ పద్ధతులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు అనూష, మౌనిక, సారిక మాట్లాడుతూ.. మహిళలు నాచురల్ డిస్పోజబుల్ శానిటరీ ప్యాడ్‌లను వాడాలని, అదే విధంగా ప్లాస్టిక్‌కు బదులుగా పర్యావరణానికి మేలు చేసే వస్తువులను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా రిసోర్స్ పర్సన్స్, మహిళా గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

## రాజీవ్‌గాంధీ జీవితం స్ఫూర్తిదాయకం

### విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలేసి నివాళులర్పించిన కాంగ్రెస్ శ్రేణులు

**కుత్బుల్లాపూర్:** దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. దేశంలో ఐటీ రంగం అభివృద్ధికి రాజీవ్‌గాంధీ పునాదులు వేశారని, నేడు దేశం అనేక రంగాల్లో రాణిస్తుందంటే ఆయన చలువేనన్నారు.



షాపూర్‌నగర్‌లో నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



బాచుపల్లిలోని కాంగ్రెస్ కార్యాలయ ఆవరణలో నియోజకవర్గ ఇన్‌చార్జి హన్మంతరెడ్డి తదితరులు

# లౌకిక శక్తులు ఏకమవ్వాలి

- సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి రాజా
- ఘనంగా రాష్ట్ర మహాసభలు ప్రారంభం
- అరుణపతాకాలతో ఎరుపెక్కిన గాజులరామారం



**సాక్షి,మేడ్చల్ జిల్లా/సుభాష్‌నగర్:** కేంద్రంలోని బీజేపీని గద్దె దించేందుకు లౌకిక శక్తులు ఏకమవ్వాలని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి రాజా పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర 4వ మహాసభలు బుధవారం గాజులరామారంలోని మహారాజా ఫంక్షన్‌హాల్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి. అంతకుముందు కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అరుణ పతాకాలతో గాజులరామారం ఎరుపుమయంగా మారింది. బీజేపీకి వ్యతిరేకంగా కార్యకర్తలు నినాదాలు చేశారు. మహాసభల్లో రాష్ట్రంలోని 33 జిల్లాలకు ప్రాతినిధ్యం వహిస్తూ.. 743 మంది పార్టీ ప్రతినిధులు హాజరయ్యారు. ప్రారంభ సభకు సీపీఐ శ్రేణులు ఎర్ర చొక్కాలు, ఎర్ర చీరలు ధరించి పెద్దఎత్తున హాజరయ్యారు. సభకు ముఖ్య అతిథిగా రాజాతో పాటు జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, సయ్యద్ అజీజ్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పాల్గొన్నారు. అంతకు ముందు అమర వీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పార్టీని తెలంగాణలో మరింత బలోపేతం చేయడానికి కృషి చేయాలన్నారు. కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. మతోన్మాద శక్తుల కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మహాసభ ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఎం.డీ.యూసుఫ్ అధ్యక్షతన జరిగిన సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, పాశ్య పద్మ, జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట రెడ్డి, కె.శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాస రావు, సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖరరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు హేమంతరావు, శంకర్, ఎం.బాల నరసింహ, బోస్, ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులు డి.జి.సాయిల్, ప్రధాన కార్యదర్శి ఇ.ఉమా మహేశ్ పాల్గొన్నారు.

### కమ్యూనిస్టు పార్టీలను ఏకం చేయాలి: కందిమళ్ల ప్రతాపరెడ్డి

వీర తెలంగాణ గడ్డపై బీజేపీ అధికారంలోకి రాకుండా అడ్డుకునే శక్తి కేవలం వామపక్ష పార్టీలకే ఉందని, ఇందుకు అన్ని కమ్యూనిస్టు పార్టీలు ఏకం కావాలని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుడు, సీపీఐ సీనియర్ నేత కందిమళ్ల ప్రతాపరెడ్డి పిలుపునిచ్చారు. సీపీఐ వందేళ్ల ప్రస్థానంలో చేసిన పోరాటాలు, త్యాగాలు సాధించిన విజయాలను మననం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలోని గాజులరామారం (కామ్రేడ్ పాట్లూరి నాగేశ్వరరావు నగర్)లోని మహారాజాగార్డెన్('కామ్రేడ్ ఎన్.బాలమల్లేశ్ హాల్)లోని సీపీఐ రాష్ట్ర 4వ మహాసభల్లో ఆయన మాట్లాడుతూ.. మాతృదేశం కోసం సీపీఐ నాయకులు ప్రాణాలను అర్పించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. 1942 వరకు భారత కమ్యూనిస్టు పార్టీపై నిషేధం ఉన్నా.. రైతులు, కూలీలు, విద్యార్థులు, యువకులను సంఘటితం చేసి స్వాతంత్ర్య పోరాటంలో కదిలించిందన్నారు. నిరంకుశ నిజాంకు వ్యతిరేకంగా మట్టి మనుషులతో బంధూకులు పట్టించి సాయుధ సమరాన్ని నడిపిన చరిత్ర సీపీఐకి ఉందన్నారు. కమ్యూనిస్టు పార్టీలను ఏకం చేసేందుకు కీలకపాత్ర పోషించాలని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజాను ఆయన కోరారు. రాజకీయాలు వ్యాపారంగా మారాయని, కమ్యూనిస్టుల పాత్ర ఏమిటనేది మహాసభలో ఆత్మపరిశోధన చేసుకోవాలని సూచించారు. కుళ్లుతున్న వ్యవస్థను కూకటి వేళ్లతో తొలగించాలని సినీనటులు మాదాల రవి అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సాంస్కృతిక విప్లవం రావాల్సిన అవసరం ఉందన్నారు. ఎర్రమల్లెలు లాంటి సినిమాలు తీసిన మాదాల రంగారావు కూడా కమ్యూనిస్టు పార్టీ తయారు చేసిన ఆయుధమేనన్నారు.

### రక్తంతో ఎరుపెక్కిందే ఎర్ర జెండా : ఏటుకూరి ప్రసాద్

అమర వీరుల త్యాగం, రక్తంతో ఎరుపెక్కిన జెండా ఎర్రజెండా అని, నిజాంకు వ్యతిరేకంగా రైతాంగ సాయుధ పోరాటంలో ఎందరో అమరులైన వారి వారసత్వం బాట ఎర్రబాట అని ఏటుకూరి ప్రసాద్ అన్నారు. గతంలో కమ్యూనిస్టులు రక్తార్పణతో ఏ ఆశయాలు, ఆదర్శాలతో ముందుకెళ్లారో.. ఆ ఆశయాల స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఫాసిజం ఎన్నో రకాల ముసుగు ధరించి చిన్నల నుంచి పెద్దల వరకు అనేక రూపాల్లో బయటపడటం ప్రజాస్వామ్యానికి తీవ్ర విఘాతమన్నారు. ఈ పరిస్థితులు ఎదుర్కొనే శక్తి కేవలం వామపక్షాలకు మాత్రమే ఉందన్నారు.